

# మార్నింగ్ రోమియో

వాకిట్లో ముగ్గు పెడుతున్న అరుణ ఉలికిపాటుతో తల ఎత్తింది బూట్ల చప్పుడు విని. "మార్నింగ్ మేడమ్!" అంటూ రివ్వున నడుస్తూ వెళ్ళిపోయాడో ఆగంతకుడు.

దిగ్భ్రమతో ముగ్గు పూర్తిచేసి లోపలికి వచ్చింది అరుణ. ఆ రోజంతా అన్య మనస్కంగా గడిపింది జరిగిన సంఘటనకి.

మరుసటి రోజు ఉదయం కూడా తయారయ్యాడు అదే సమయానికి. వాకిట్లో... భయపడుతూనే వుంది చుట్టూ ఎవరైనా చూస్తారేమో అని... ఆ రోజు మంచీ ఇంట్లో చెప్పాలా? మానాలా? అనే సందిగ్ధావస్థలో పడింది. కాలేజీకి వెళ్ళివస్తోంది... ఇంటి పనులు చేసుకుంటోంది మామూలుగా...

ఇంకోనాటి ఉదయం "ముత్యాల ముగ్గు హీరోయిన్ మీ ముందు పనికి రాదు"అంటూ వెకిలిగా నవ్వుతూ వెళ్ళిపోయాడు. రాస్కెల్! అని మనసులో తిట్టుకుని లోపలికి వెళ్ళింది.

ఆ రాత్రి తన అక్క సరితతో గత వారం రోజులుగా ఆ మార్నింగ్ రోమియో పెడుతున్న అల్లరి గురించి చెప్పింది. తల్లిదండ్రులకు తెలిస్తే బాధ పడతారని ఆ ఇడియట్‌కి ఎలాగైనా బుద్ధి చెప్పాలని నిర్ణయించుకొని ప్లాన్ సిద్ధం చేసుకుని నిద్రపోయారు.

మరో రెండ్రోజుల తర్వాత ప్రభాత వేళ మార్నింగ్ రోమియో రావడం గమనించి అక్కకి సైగ చేసింది అరుణ. సరిత ఇచ్చిన గ్రీన్ సిగ్నల్ అందుకుని...

"హల్లో! మార్నింగ్!"అంది అరుణ అతడు వాకిలి దాకా వచ్చిన తరువాత...

అనుకోని 'విష్'కి ఆశ్చర్యపడి "హల్లో! మేడం"అన్నాడు పిట్ట తన దారికొస్తోందనే ధోరణిలో...

"జస్ట్ ఎ మినిట్! ప్లీజ్ కమ్ టూ మై హౌస్"అంటూ లోపలికి దారి తీసింది.

ఒకింత సంతోషం, మరొకింత ఆశ్చర్యంతో ఆమె వైపు చూస్తూ లోపలికెళ్ళాడు.

వరండాలో నిలబడ్డ సరితను పిలిచి "అక్కా! నీకు రోజూ చెబుతున్నానే మార్నింగ్ రోమియో అని, ఇతనే అతను" అంటూ ఒక్కసారిగా సీరియస్‌గా ముఖం పెట్టి ... అతని వైపు తిరిగి...

"మిస్టర్ మార్నింగ్ రోమియోగారూ! మీరు ప్రతి ఉదయం పడే బాధ చూస్తున్నాను. బహుశా మీకు ఏ ఉద్యోగం లేదనుకుంటా? అందుకే! మీకో ఉద్యోగం చూపిద్దాం అనుకుంటున్నా...! జీతం కూడా బాగానే ఇస్తాం... లీవ్ పెడితే జీతంలో కటింగ్స్ వుంటాయి. పని బాగా చేస్తే బోనస్ వుంటుంది. పండగలకి" అంటూ... దొడ్లోకి వెళ్ళి బకెట్ నీళ్ళు, చీపురు కట్ట, ముగ్గు అతని ఎదురుగా పెట్టింది...

అంతే! ఊహించని పరిణామానికి అతని తల తిరిగినట్టయి అవమానంతో తలవొంచుకుని బయటికి ఉడాయించాడు ఎర్రబడిన ముఖంతో...

తోక ముడిచి పారిపోయిన అతన్ని చూసి భుజాలెగరవేస్తూ... 'థేంక్యూ!' సిస్టర్ అంటూ సరిత చేయి ముద్దు పెట్టుకుని ఆనందంగా గేట్ మూసింది అరుణ.

—కె. అన్నపూర్ణ

# అతి కవితా నిస్సారం

గులకరాళ్ళ మీద చూపులు నునుపుదేరి
రహదారి కట్టెదుట ఒక రుద్ర నయనం పాదముద్రలు
నొదిలేస్తూ వెళ్ళినప్పుడు
దృశ్యం నాలుగు దిక్కులకూ కుంచించుకుపోయినప్పుడు
ఆకాశం నీలి నీలి దారాలై నేలరాలి
నీటి పాములు ఏడో నంబర్ సిటీ బస్సు ముందు
కోరలు కొమ్ముల ముగ్గులు చుట్టినప్పుడు
శీతలమైపోయిన ఒక మహాప్రాణి ఆర్తనాదంలా
నీవు అర్థం కావు
మూడు కాళ్ళ ప్రమిదలో దాహం తీర్చుకుంటున్న ఒక
నికిని పిచ్చుక
చైనా గ్రేట్ వాల్ మీద కొనగోటితో
గోరంతలు కొండంతలు రాస్తున్నప్పుడు
మా పూర్వీకుడి దళసరి కళ్ళద్దాలపై
అంతకన్నా పూర్వపు పుర్రె ఒకటి పగిలి పగలబడి సకాలున
నవ్వినప్పుడు
గాన శిల్పం సిగన ముకుళిత సూర్యబింబం
బోధివృక్షం కొనలు పట్టి మెడలు వొంచి కొన కొమ్మని
కసిగా ముద్దాడినప్పుడు
గాలివాలు నీటి పతంగం పాతాళంలో ఎగురుతున్నప్పుడు
నిష్ఫల వాగ్దానాలు నాగేటిచాలులో హస్తసాముద్రికమై
అల్లుకున్నప్పుడు
బ్రహ్మజెముడు వడగాలికి కంటక నేత్రం విప్పినప్పుడు
నీవు నాకు అర్థంకావు
కాకిగోలలో నిత్యం విహంగ విహారం చేసే కోకిల గొంతులో
ఒక చేప పిల్ల ఈత రాక
పత్తి రైతుకు పూల మాల వేసినప్పుడు
నీ'సెంటు' రోడ్డులో పట్టుపురుగులు పుట్టగొడుగులు పట్టు
కుని పారాడినప్పుడు
వాకిట్లో నొంటెల్లూ
చెట్టు కింది పడగ్గదీ
సేవుమెంటు నిత్య శోభనం
పతాక శీర్షికల్లోకి పసి పిల్లల్లా పాకినప్పుడు
సైదుకాల్వల కీచురాళ్ళ పావురాళ్ళు
దేశం మీదికి భక్తిగీతాలు రువ్వుతున్నప్పుడు
'అంతా ఆత్మికం తమనంతా ఆత్మికం' అంటూ
ఎవడో ఒకడు స్వప్న యశస్సులోంచి 'దివ్య'నాదం ఒకటి
సంధిస్తున్నప్పుడు
పడమటి మారుతం గొంతు కడ్డంపడి
పాటలోని పత్రహరితాన్ని చిదిమేసినప్పుడు
అరచేతిలోని అదృశ్య రేఖలను శూన్యం కమ్మేసినప్పుడు
మరీ ముఖ్యం నల్లకొంగ తెల్లకాకికి సాక్ష్యం పలికినప్పుడు
నువ్వసలు అర్థంకానే కావు
నువ్వసలు నా అవసరానివే కావు

*[అనేకమంది అస్పష్ట కవులను ఒకేసారి చదివి, 'అతి కవితా వ్యాధి' సోకి...]*

—కె. నరసింహాచారి